ప్రజాశక్తి
మంగళవారం 30 జులై 2024 5 అనంతపురం

మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి, శ్రీ సత్య సాయి, సిపిడబ్ల్యుఎస్ స్కీముల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురంలో రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ 500 ఆర్ డబ్ల్యూఎస్, సిపిడబ్ల్యూఎస్, సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీముల ద్వారా వేలాది మంది కార్మికులు వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తూ నిరంతరం పనిచేస్తున్నారన్నారు. కరోనా సందర్భంగా కూడా కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేసి గ్రామాలకు త్రాగునీరు అందించారన్నారు. అయితే ఈ కార్మికులకు నెలలకొద్ది వేతనాలు రాకపోవటంతో వారి కుటుంబాలు అప్పులపాలు అవుతున్నాయన్నారు. వాటర్ సప్లయి కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్. చెల్లించాలన్నారు. కార్మిక సంక్షేమ చట్టాలు అమలుచేసి, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. రాయదుర్గం స్కీములో 3 నెలల బకాయి, 16 నెలల పిఎఫ్ బకాయి, పిఎబిఆర్‌లో 4 నెలల వేతనాలు, 16 నెలల పిఎఫ్, కళ్యాణదుర్గంలో 5 నెలల వేతనాలు, 16 నెలల పిఎఫ్, హిందూపురంలో 5 నెలల వేతనాలు, 24 నెలల పిఎఫ్, శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్‌లో 9 నెలల పిఎఫ్. 6 నెలల వేతనాలు, 7 నెలల ఇఎస్ఐ తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి, రామగిరి సిపిడబ్ల్యూ ఎస్ స్కీములో 29 నెలలు బకాయిలున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందనానరు. ఇప్పటికైనా స్పందించికార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించేటట్లు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా కార్మికులకు వేతనాలు బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఉచితంగా తాగు నీరు అందించాలన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతపురము జిల్లా కళ్యాణదుర్గంలో ఐదుగురు కార్మికులపై పెట్టిన అక్రమ కేసును ఎత్తి వేయాలన్నారు. అర్హతల లేకుండా కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్న శివశంకర రెడ్డిని బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, ఆర్. ఎర్రిస్వామి, ఈశ్వరయ్య, వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న పాత తప్పిదాలు

- నామినేషన్‌పై రూ.34.52 కోట్ల పనులు
- వివరణ ఇవ్వాలని నోడల్ కమిటీ సభ్యులకు తాఖీదులు
- జెఎన్‌టియులో నిబంధనలకు విరుద్ధంగా పనుల అప్పగింత
- తప్ప చేసిన వారే పీఠంపై ..?

జెఎన్‌టియు భవనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జెఎన్‌టియులోని నోడల్ కమిటీ సభ్యులను పాత తప్పిదాలు వెంటాడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్‌పై పనుల కేటాయింపు చేసిన కమిటీ సభ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణివ్వాలనని కోరుతూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి నుంచి ఉత్తర్వులు వెలువడటం ఇప్పుడు అనంతపురం జెఎన్‌టియులో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ ఉత్తర్వులొచ్చి నెల రోజులవుతున్నా గట్టుగా దాచిపెట్టడం చర్చనీయాంశమవుతోంది. గత నెల అంటే జూన్ 26వ తేదీన ఈ ఉత్వర్వులు వెలువడ్డాయి. అప్పటి నుంచి ఎవరికి వారు మౌనంగా ఉంటూ వస్తుండటం గమనార్హం.

నిబంధనలకు విరుద్ధంగా రూ.45 కోట్లు అదనపు చెల్లింపులు

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని కలికిరి ఇంజనీరింగు కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించింది. ఈ పనులను డిఇసి ఇన్‌ఫ్రా అనే సంస్థకు కేటాయించారు. ఎనిమిది విడతల్లో ఈ నిధులను విడుదల చేశారు. అయితే డిఇసి ఇన్‌ఫ్రాతో మొదట కుదుర్చుకున్న ఒప్పందం కంటే ఎక్కువ నిధులను కేటాయిస్తూ నోడల్ కమిటీ అనుమతులు కూడా లేకుండా పనులు చేపట్టారు. ఇందులో రూ.375 కోట్ల పనులు చేపట్టగా రూ.337 కోట్లు చెల్లింపులు కూడా చేశారు. అంటే ఎటువంటి అనుతుల్లేకుండానే అదనపు పనులు చేపట్టడంతోపాటు బిల్లులు రూ.45 కోట్లు నిర్మాణ సంస్థకు ఇచ్చేశారు. దీనిపై ఒక వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో 2018లో దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు కూడా జరిగింది. ఆడిట్ జనరల్ విచారణ చేపట్టి అదనపు చెల్లింపులు వాస్తవమేనని తేల్చింది.

నామినేషన్‌పై రూ.34.52 కోట్లు

లక్ష రూపాయలకు మించిన ఏ పనులను నామినేషన్‌పై చేపట్టవద్దని ప్రభుత్వ ఉత్తర్వులున్నా అనంతపురం జెఎన్‌టియులో మాత్రం ఏకంగా రూ.34.52 కోట్ల విలువైన పనులను నామినేషన్‌పై నిర్మాణ సంస్థకు అప్పగించారు. అది కూడా నోడల్ కమిటీ అనుమతులు కూడా తీసుకోకుండా ఏకపక్షంగా పనులు అప్పగించారు. దీనిపైనా నోడల్ కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఇప్పుడు ఉన్నత విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది.

తప్ప చేసిన వారే పీఠంపై ?

నిబంధనలకు విరుద్ధంగా ఆనాడు పనులు అప్పగించిన వారు, చెల్లింపులు చేసిన వారే ఇప్పుడు పీఠం ఉండటం కొసమెరుపు. ఆనాడు నోడల్ కమిటీలో సభ్యులుగా ఉండి నిబంధనలు పాటించని అధికారులే ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సిన స్థానంలో కూర్చొని ఉండటం గమనార్హం. దీంతో ఇప్పుడు ప్రభుత్వ ఉత్తర్వులు అమలు ఏ రకంగా ఉండనున్నాయన్నది జెఎన్‌టియులో చర్చనీయాంశమైంది.

ఘనంగా ఎస్‌కెయు 44వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 44 సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా వర్సిటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత, రెక్టర్ వెంకట నాయుడు,కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకుమారి శ్రీకష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎస్కేయు ఆవిర్భావం, అంచెలంచెలుగా వర్సిటీలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. యూనివర్సిటీలో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించిన వారి గురించి చెప్పారు. ఉన్నత విద్య చదివి ఉన్నత కొలువుల్లో చేరిన వారే కాకుండా విద్యార్థి నాయకులుగా ఉండి ఉద్యమాలు చేసి రాజకీయాల్లో చేరి ప్రజాప్రతినిధులు అయిన వారు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టర్ ఆచార్య జి. వెంకట నాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, బోధన, బోధనేతర సిబ్బంది, అకాడమిక్ కన్సల్టెంట్స్, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు, వర్సిటీ పిఆర్‌ఒ రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు

శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి- అనంతపురం అర్బన్

ప్రజా ఆరోగ్యమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం అనంతపురంలోని సర్వజన ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ప్రతి వార్డును సందర్శిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులపై నిర్లక్ష్యం వహించకుండా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఆసుపత్రిలో వసతులపై ఆరా తీశారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పిస్తాం : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో తగిన సౌకర్యాలు కల్పిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు సరిపడా గదులు, బెడ్లు లేవన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సంబంధించిన వారి వాహనాలు పెట్టుకునేందుకు పార్కింగ్ స్థలం కూడా లేదని చెప్పారు.

ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వసతులున్నా వైద్యులు లేరన్నారు. రోగులకు సరిపడా వైద్యులను త్వరలోనే నియామకాలు జరుపనున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో వసతుల కల్పన, తదితర అంశాలను తెలుసుకునేందుకే తనిఖీ చేపట్టినట్లు తెలిపారు.

అభివృద్ధి చేస్తాం : గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ అనంతరం మెడికల్ కళాశాలలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కేంద్రం, రాష్ట్రం లోనూ ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి కషి చేస్తామని చెప్పారు. దాతలు ముందుకొచ్చి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, డిఎంహెచ్ఒ ఈబీ దేవి, సూపరింటెండెంట్ డాక్టర్.వెంకటేశ్వర ప్రసాద్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. మాణిక్యరావు, ఆర్ఎం డాక్టర్.హేమలత తదితరులు ఉన్నారు.

బాధలతో వచ్చే ప్రజలకు భరోసా కల్పించాలి : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

బాధలతో పోలీసు స్టేషన్ కి వచ్చే ప్రజలకు భరోసా కలిగించేలా విధులు నిర్వహించాలని ఎస్పీ కెవి మురళీకృష్ణ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక టూటౌన్, ట్రాఫిక్, రూరల్ పోలీస్ స్టేషన్ లను జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పోలీసు స్టేషన్ల లోని లాకప్ గదులు, రిసెప్షన్, కంప్యూటర్ రూమ్, జి.డి మరియు రికార్డుల నిర్వహణ, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. యూ.ఐ కేసులలో పురోగతి సాధించాలన్నారు. పిటి కేసులలో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రెసిడెన్సియల్ ఏరియాలు, కళాశాలలు ఈ స్టేషన్ ల పరిధిలో ఎక్కువుగా ఉండటం వల్ల నిత్యం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూ ప్రజల ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా మరియు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలలో టూటౌన్ సి.ఐ క్రాంతికుమార్, రూరల్ సి.ఐ రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఫామాయిల్ మొక్కల సాగుతో అధిక ఆదాయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఫామాయిల్ మొక్కలను పెంచడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని నేమకల్లు గ్రామలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల నుంచి రూ.కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకున్న ఫామాయిల్ మొక్కలను రైతులు సాగు చేయాలని శాస్త్రవేత్తలు, హార్టికల్చర్ అధికారులు సూచిస్తున్నారన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఎంపిక చేసిన ఆరు మండలాల్లో బొమ్మనహాల్, కణేకల్, డి.హీరేహాల్ మండలాలను ఎంపిక ఎంపిక కావడం శుభ సూచికమన్నారు. మొక్కలను నాలుగేళ్లుపోషిస్తే ఒక సంస్థ కొనుగోలు చేసి రైతుకు అందిస్తూ వాటినుంచి వచ్చే పామాయిల్‌ని ఇక్కడే తయారు చేసి మన రాష్ట్రానికి ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. రైతులు అవసరమైన మొక్కలను తక్కువ ధరకే రైతులు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు నాయక్, సాయికుమార్, టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు మల్లికార్జున, మాజీ సర్పంచి హనుమంతురెడ్డి, బసప్ప, రైతులు పాల్గొన్నారు.

సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులోకి నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, తదితరులు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి ఉరవకొండ

ఉరవకొండలో తాగునీటి సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపే దిశగా పనిచేస్తామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను, వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో తాగునీటి సమస్య ఎంత తీవ్రంగా ఉందో ఎన్నికల సమయం నుంచి చూస్తున్నామని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెల రోజులపాటు తాగునీటి సమస్య వస్తే తాత్కాలికంగా ఉపశమనం కోసం ట్రాక్టర్లను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయడం జరిగిందని అన్నారు. ఉరవకొండ పట్టణ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు భిన్న ఆలోచనలు చేస్తున్నామన్నారు. రాబోయే ఆరు నెలలు, సంవత్సర కాలంలో ఏ రకమైన ప్రాజెక్టులను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాని శాశ్వతంగా పరిష్కరించేందుకు ఏం చేయాలన్న దానిపై ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లోకి నీటి పంపింగ్ మొదలైందని, వారం రోజుల్లో నీటి పంపింగ్‌ని పురోగతిలోకి తీసుకురాగలుగుతామని అన్నారు. ఉరవకొండకు సంబంధించి తాగునీటి సరఫరా చేసే కార్మికులకు 9 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, వారు ఏ రకంగా పనిచేస్తారని అన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థను మొత్తం కుప్పకూల్చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసుల రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాషా, డిఈ అంజుమన్ సఫ్రీన్, జెఈ ఫామినా, శ్రీ సత్యసాయి తాగునీటి పథకం డీఈ రామారావు, ఏఈ భార్గవ్,సైట్ ఇంజనీర్ బాలు యాదవ్, ఎంపీడీవో సుబ్బరాజు, డిప్యూటీ తహశీల్దార్ హరినాథ్, హెల్పర్ శ్రీరామ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల

ప్రజాశక్తి-గుంతకల్లు

రైల్వేశాఖలో పని చేస్తున్న కాంటాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు అనుబంధ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్.నాగేంద్రకుమార్, నాయకులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డిఆర్ఎం కార్యాలయం ఎదుట రైల్వే కాంట్రాక్టు వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అంతేగాకుండా కాంట్రాక్టర్లు కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించకుండా మోసాలు చేస్తూ, జీతాల్లో అక్రమంగా కోతలు చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు మారినా పాత కార్మికులను పనుల్లో కొనసాగనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆయా విషయాలపై కార్మికులు ఎవరైనా ప్రశ్నిస్తే ఉద్యోగాల నుంచి తొలగింపులు, కక్షసాధింపు చర్యలు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి తోడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యజమానులకు అనుకూలంగా, కార్మికుల శ్రమను మరింత దోపిడీ చేసేందుకు కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. ఈ కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత కనుమరుగవుతాయన్నారు. ఇప్పటికే రైల్వేలో 40 శాతం ఖాళీగా ఉన్న పర్మినెంట్ పోస్టుల రద్దు (సరండర్)తోపాటు కాంట్రాక్ట్ సిబ్బందిని కూడా 25శాతం నుంచి 50శాతం వరకూ కుదించాలని రైల్వేబోర్డు ఆదేశాలిచ్చిందన్నారు. ఇప్పటికైనా రైల్వే బోర్డు జోక్యం చేసుకుని రైల్వే కాంటాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, తిమ్మప్ప, జాకీర్, ఓబులేసు, షాషా, సురేంద్ర, రామునాయక్, రైల్వేవర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, వెంకటేష్, అనిల్, హరిబాబు,షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైల్వే కాంట్రాక్టు వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్.నాగేంద్రకుమార్

సమస్యలను ఎమ్మెల్యే పరిటాల సునీతకు వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే పరిటాల సునీతకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండలంలోని ప్రజాశక్తి కాలనీలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆమె నివాసంలో కలిసి ప్రజాశక్తి కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాంగోపాల్, సిపిఎం నగర రెండో కమిటీ కార్యదర్శి ఆర్వీ నాయుడు మాట్లాడుతూ కక్కలపల్లి పంచాయతీలో సిపిఎం ఆధ్వర్యంలో 17 సంవత్సరాల క్రితం ప్రజాశక్తి నగర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాలనీ ప్రజల అవసరాలరీత్యా కొంత స్థలం కేటాయించినట్లు తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అప్పట్లో మంత్రిగా పనిచేస్తున్న సమయంలో పరిటాల సునీత దృష్టికి ఈ విషయాన్ని తీసుకువస్తే తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ తర్వాత కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కాలేదని, ఆ స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేయాలని చూస్తే సిపిఎం నాయకులు, స్థానిక ప్రజలు అడ్డుకొని స్థలాన్ని కాపాడుకోగలిగామని చెప్పారు. ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందించి పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కాలనీలో అంగన్వాడీ సెంటర్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందని అది పూర్తి చేయాలని కోరారు. కాలనీలో ప్రజలు రేషన్ బియ్యం కోసం కక్కలపల్లి కాలనీకి వెళ్లాల్సి వస్తుందని, ప్రజాశక్తి కాలనీలోనే రేషన్ షాపు మంజూరు చేసి ప్రజలకు అందుబాటులో వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వాటర్ ట్యాంక్ నిర్మించాలని, వంకకు సేఫ్టీ వాల్ నిర్మించాలని, శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు.. స్పందించిన ఎమ్మెల్యే కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, శీనా, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

మహిళా సంఘా సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

దశలవారీగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యేని సురేంద్రబాబు తెలిపారు. సోమవారం ప్రజావేదిక వద్ద వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మహిళా సంఘా సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇందు లో భాగంగా మహిళా సంఘాల సభ్యు లు అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చరు. అలాగే రైతుల సమస్యల తో పాటు తాగునీరు, రోడ్లు, విద్యుత్ కనెక్షన్లు తదితర సమస్యలపై నాయకులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. త్వరలో అన్నిశాఖల అధికారులతో సమీక్షించి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఎస్పీ

మంత్రికి బొకే అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం : వైద్యవిద్యా శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఎస్పీ కెవి.మురళీకృష్ణ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎస్పీని కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రితో పాటు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఉన్నారు.

నింబగల్లు సచివాలయం తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుబ్బరాజు

వజ్రకరూరు : ఉరవకొండ మండలంలోని నింబగల్లు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ సుబ్బరాజు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులోఉ భాగంగా సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. అంతేగాకుండా సమయపాలన పాటించాలన్నారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, జిఎస్‌డబ్ల్యూఎస్ శాఖ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి పంట పొలాలను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

బొమ్మనహాల్ మండలంలో నేమకల్లు పరిసరాల్లో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాతావరణ కాలుష్యం నుంచి పంట పొలాలలతోపాటు ప్రజలకు కాపాడాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. ఈమేరకు అనంతపురంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో సుమారు 18ఏళ్లుగా పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం వల్ల పంటలు నాశనం అవుతున్నాయన్నారు. దీనికితోడు కలుషితమైన గాలి పీల్చడం వల్ల పిల్లలు, వృద్ధులు, రైతులు శ్వాసకోశ, చర్మ సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నట్లు వివరించారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. విన్నవించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, ఏపీ రైతుసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, గురుస్వామి, తదితరులు ఉన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మూర్తి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని నడిమివంకలో చేపట్టిన పూడికతీత పనులను కమిషనర్ పివివిఎస్.మూర్తి సోమవారం పరిశీలించారు. అనంతరం కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు వద్ద ఉన్న వంకను పరిశీలించి పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని చిన్న, పెద్ద, కాలువల్లో త్వరితగతిన పూడికతీత పనులు చేపట్టాలన్నారు. అలాగే తీసిన పూడికను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుభాష్ చంద్రబోస్, రూపశిల్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం : జిల్లాలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు మెడికల్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజారోగ్య వేదిక సభ్యులు కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీకి వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. విభజన చట్టంలో భాగంగా జిల్లాకు కేటాయించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. కావున మీరైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య, కార్యదర్శి శ్రీనివాసరావు, ఏజీ రాజమోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వీరభద్రయ్య పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ శిక్షణశిబిరం విజయవంతం

బుక్కరాయసముద్రం : ఆర్‌డీటీ, స్పెయిన్ సౌజన్యంతో ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించిన బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసింది. ముగింపు సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర అధ్యక్షతన స్పెయిన్ కోచ్‌లు టోనీ, కీకే, నౌసిక, ఆల్బేత్‌ను ఘనంగా సత్కరించారు. శిక్షణలో భాగంగా రోజూ దాదాపు 150 మంది వరకూ శిక్షణ తీసుకున్నట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, లలితమ్మ సీనియర్ క్రీడాకారులు రాజు, బాషా, భాస్కర్, సాయి ఆరీఫ్, రషీద్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కవి 'సినారె'కు నివాళి

అనంతపురం : ప్రగతిశీల మానవతావాద కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) అని పలువురు వక్తలు కొనియాడారు. సినారె జయంతిని పురస్కరించుకుని మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య, ఎస్‌కెయు తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు గంగిరెడ్డి గారి అశ్వర్థరెడ్డి, తెలుగు వెలుగు సాహిత్య సంస్థ అధ్యక్షులు టీవీ.రెడ్డి, ఉమర్ అలీషా, సాహితీ సమితి అధ్యక్షులు షేక్ రియాజుద్దీన్ అహ్మద్,నిమ్మల వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భాగస్వామ్య దినోత్సవం

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని సంతే కొండాపురం పంచాయతీ కోనాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచి వనిత మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఓలిగలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌నాయుడు, ఎస్ఎంసి ఛైర్మన్ కరేగౌడ, మాజీ ఎంపిటిసి కరేగౌడ, పెంకుల మల్లికార్జున, నల్లమల, తిప్పేస్వామి, ఉపాధ్యాయురాలు సురేఖ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పామిడి : చిన్న పీర్ల పండుగ సందర్భంగా స్థానిక 5, 6 వార్డుల్లో చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు ఆర్ఆర్.రమేష్ రూ.30వేలు విరాళం అందజేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మొహరం వేడుకలను జరుపుకోవాలని ఎమ్మెల్యే తనయుడు విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

'సీమ' బలిజ మహాసంఘం అధ్యక్షుడిగా శంకరయ్య

అనంతపురం : రాయలసీమ బలిజ మహాసంఘం నూతన అధ్యక్షుడిగా తొండపునాటి శంకరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజల అభ్యున్నతి, సాంఘిక, ఆర్థికాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బలిజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

శింగనమల : విద్యార్థులకు రుచికరంగా మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఇఒ నరసింహరాజు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా భోజనంతోపాటు కేసరీ వడ్డించడాన్ని చూసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కూటమిది ప్రజా ప్రభుత్వం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమితో ప్రజల ప్రభుత్వం ఏర్పాటైందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పవిత్ర వన్నూరుస్వామి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే చంద్రబాబు డ్వాక్రా సంఘాలకు బలోపేతం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఏ పని చేయాలన్నా ప్రభుత్వం దగ్గర ఒక్క రూపాయి లేదన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర సహాయ, సహకాలను తీసుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. కావు ప్రతి ఒక్కరూ సిఎం చంద్రబాబుకు సహకారం అందించాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. వాటిపి పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హసీనాభాను, వైస్ ఎంపిపి లింగప్ప, సర్పంచులు, ఎంపిటిలు పాల్గొన్నారు.

పారిపోయిన విద్యార్థులు తల్లిదండ్రులకు అప్పగింత

విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని దుగుమర్రి గ్రామానికి చెందిన గరుడ శేఖర్‌రెడ్డి కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి, నార్పలలో నివాసముంటున్న కురుగానపల్లి గ్రామానికి చెందిన మధు కుమార్తె సాయికీర్తన పాఠశాలలకు వెళ్లడం ఇష్టం లేక సోమవారం ఉదయం ఇళ్ల నుంచి పారిపోయారు. జగదీశ్వర్‌రెడ్డి అనంతపురం గ్లోబల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామానికి వచ్చిన జగదీశ్వర్‌రెడ్డి తిరిగి సోమవారం పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక ఉదయం 7-30 గంటలకు పాఠశాలకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిపోయాడు. అయితే పాఠశాలకు ఫోన్ చేసి తెలపగా విద్యార్థి రాలేదని సమాధానం ఇచ్చారు. ఆందోళనకు గురైన విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కురుగానపల్లికి చెందిన మధు కుమార్తె సాయి కీర్తన శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ అమ్మాయి కూడా పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక సోమవారం ఉదయం 5-30గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరి విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి వెంటనే సామాజిక మధ్య మాల్లో ఫొటోలు పెట్టి వెతకడం ప్రారంభించారు. ఎట్టకేలకూ నార్పల పరిసరాల్లోనే విద్యార్థి జగదీశ్వరరెడ్డి, విద్యార్థిని సాయి కీర్తనను కొందరు యువకులు గుర్తించి ఎస్ఐకి సమచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అమ్మాయిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో విద్యార్థి, విద్యార్థిని తల్లిదండ్రులు ఎస్ఐతోపాటు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

కౌలుకు భూమి సాగు చేసే ప్రతి రైతూ తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. సోమవారం స్థానిక కక్కలపల్లి, కాటిగానికాలువ ఆర్ఎస్‌కె పరిధిలోని గ్రామాల్లో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు తీసుకోవడం వల్ల రైతులకు అనేక లాభాలు ఉన్నాయన్నారు. కౌలు గుర్తింపు కార్డు పొందిన రైతులకు పంట నష్టపరిహారం, బీమా, బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చంద్రకుమార్, ఎంపిటిసి పెన్నోబులేసు, వ్యవసాయ విస్తరణ అధికారులు బి.మురళీకృష్ణ, అలేఖ్య, గ్రామ ఉద్యాన సహాయకులు కిషోర్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల జారీలో నిర్లక్ష్యం వద్దు..

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించొద్దని అనంతపురం డివిజన్ ఎడిఎ ఎం.రవి సూచించారు. సోమవారం సాయంత్రం అనంతపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో భూసార పరీక్షలు శాంపుల్స్ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎఒ జె.శశికళ, గార్లదిన్నె ఎఒ సోమశేఖర్, బుక్కరాయసముద్రం ఎఒ శ్యాంసుందర్‌రెడ్డి, రాప్తాడు ఎఒ శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల వద్దకే ఎస్పీ

అర్జీల స్వీకరణ

దివ్యాంగురాలి సమస్య వింటున్న ఎస్పీ కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమస్యలపై వినతిపత్రాలు సమర్పిందుకు వచ్చిన వికలాంగుల వద్దకే స్వయానా ఎస్పీ కెవి.మురళీకృష్ణ వచ్చి సమస్యలను ఆలకించారు. సోమవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం, శెట్టూరు ప్రాంతాల నుంచి ఇద్దరు దివ్యాంగులు వచ్చారు. నడవలేని స్థితిలో ఉండటాన్ని గమణించిన ఎస్పీ కాన్ఫరెన్స్ హాలు బయట ఉన్న దివ్యాంగుల వద్దకు వచ్చి సమస్యలను విన్నారు. చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఇకపోతే ప్రజల నుంచి 117 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో భాగంగా జిల్లా నలమూలల నుంచి విచ్చేసిన పిటీషనర్లతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. లోతుగా సమస్యలు విని వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి ఆదేశించారు. ఈ ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్, ఎస్‌బి సిఐ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

మటన్ మార్కెట్‌ను తరలించాలని వినతి

రాయదుర్గం : పట్టణంలోని దాసప్ప రోడ్డు వద్ద ఉన్న మటన్ మార్కెట్‌ను పట్టణ వెలుపలకు తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పి.కిషోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన : ఎమ్మెల్సీ

వజ్రకరూరు : రాష్ట్రంలో ఆటవిక, అరాచక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వం హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలకు పాల్పడటం బాధాకరమన్నారు. అమలుకాని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి హామీలను అమలు చేయకుండా అరాచకంతో ప్రజలను మరోసారి మోసం చేస్తోందన్నారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు స్పందించి రాష్ట్రంలో దాడులు, హత్యలు, దౌర్జన్యాలను ఆపాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం దగ్గర సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, కె.రామేశ్వరరెడ్డి, ఎంవి.సుబ్బయ్య, కుందు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామ పరిధిలో ఉన్న సేవాఘడ్‌లో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు సభ్యులు భూక్యా వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో మధుమేహం, గుండె, ఎముకలు, ఊపిరితిత్తులు, వెన్నెముక, చెవి, ముక్కు, గొంతు, దంత, నేత్ర, నరాలు, సాధారణ జబ్బులు, చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

డ్యుయల్ డిగ్రీ విద్యకు ప్రవేశ పత్రాలు అందజేత

ప్రవేశ పత్రాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, స్వీడన్‌లోని బ్లేంకింగ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు అర్హత పొందిన 13 మంది విద్యార్థులకు జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య సోమవారం అడ్మిషన్ల పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం, బ్లెకింగ్ వర్సిటి (స్వీడన్) సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ కోర్సులను అమలు చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా 13 మందికి అడ్మిషన్ పత్రాలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిన్‌ఫైర్స్ డైరెక్టర్ పి.సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి, ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మరువకొమ్మ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నేతలు

శింగనమల : అనంతపురం-తాడిపత్రి జాతీయ రహదారిలో భాగంగా శింగనమల మరవకమ్మ క్రాస్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని టిడిపి నాయకులు సి.వెంకటేష్, బండి వెంకటనారాయణ, ఎర్రిస్వామి కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శింగనమల పరిసర గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే సమీపంలోని శివపురం పెద్దమ్మ ఆలయం వద్దకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఇలా చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి మరువకొమ్మ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.

బీసీ హాస్టల్ తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని బిసి హాస్టల్‌ను వైద్యాధికారిణి శ్రీవాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లు, వంటలకు ఉపయోగించే కూరగాయలతోపాటు నిత్యావసర సరుకులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ హాస్టల్లో గదులు, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేకపోతే రోగాల బారిన పడతారని సూచించారు. విద్యార్థులు ఎవరైనా దగ్గు, జ్వరము వంటి వ్యాధులు వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శివారెడ్డి, ఏఎన్ఎం, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

వజ్రకరూరు : ఉరవకొండ మండల కేంద్రంలోని గాంధీ హరిజన హాస్టల్ స్థల సమస్యను పరిష్కరించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను హాస్టల్ కమిటీ సభ్యులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి పెద్దలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి : మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, కమిషనర్ జి.శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలన్నారు.

పెన్షనర్ల ఆశాజ్యోతి 'నకారా'కు నివాళి

గుత్తి : కేంద్ర, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల ఆశాజ్యోతి డి.ఎస్.నకారా వర్ధంతిని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, నాయకులు నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, షేక్షావలి, గోవిందప్ప, నారాయణశెట్టి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ తహశీల్దార్‌కు సన్మానం

పుట్లూరు : బదిలీపై వెళ్తున్న తహశీల్దార్ కె.మల్లికార్జునస్వామిని స్థానిక కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా శాలువా కప్పి బొకే అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, విఆర్‌ఒలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛను : ఎంపిడిఒ

బుక్కరాయసముద్రం : పింఛన్‌దారులు ఎవరూ కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన పని లేదని ఇంటి వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ ఉదయం 6గంటలకే సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తారన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన డిగ్రీ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఇన్‌ఛార్జి ఉపకులపతి అనిత సోమవారం విడుదల చేశారు. ఫలితాల్లో 98.46 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

శెట్టూరు : ఉపాధి హామీ పథకం సిబ్బంది సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉరాల కుమార్, ఇఒఆర్‌డి రఘురామ్‌రావు, ఎంఇఒ శ్రీధర్, ఎపిఒ నీరజ, ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్‌ఖాన్, ఇసి వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వరమ్మ, టిడిపి సీనియర్ నాయకులు నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

బొమ్మనహాల్ : సీజనల్ వ్యాధుల నివారణపై సోమవారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది జనాబీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

విగ్రహాలకు మరమ్మతులు చేయాలి

పామిడి : పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు మరమ్మతులు చేపట్టాలని సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో స్థానికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మా గాంధీ, జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్ వంటి విగ్రహాలు పట్టణంలో అనేకంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం వాటి బాగోగులు ఎవరూ చూసుకోకపోవడంతో అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కావున వెంటనే అధికారులు స్పందించి విగ్రహాలకు శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చోహన్, అంజినాయక్, పూజారి లక్ష్మీదేవి, రాజశేఖర్, ముసలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

పెద్దపప్పూరు : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం మండలం పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరినాథ్‌రెడ్డి (40) తోటలో ఉన్న పైపులను పక్కకు తీస్తుండగా పైనున్న 11కెవి విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదేతోటలో పని చేసేందుకు వచ్చిన తురకపల్లి యువకుడు శేఖర్ గమణించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినటుల వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గౌస్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య హరిత, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ముగ్గురికి జీవితఖైదు

అనంతపురం క్రైం : కళ్యాణదుర్గం డీఎస్పీ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో అనంతపురానికి చెందిన మారుతీ, హనుమంతు, స్వర్ణరాజుకు జీవితఖైదు విధిస్తూ అనంతపురం మహిళా కోర్టు జడ్జి శ్రీమతి శోభారాణి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాల మేరకు జీవితఖైదు పడిన ఈ ముగ్గురు మరియు అనంతపురంనకు చెందిన భీమేష్ మంచి స్నేహితులు. వీరంతా కలిసి చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. ఈక్రమంలో భీమేష్ పోలీసులకు చిక్కాడు. మిగితా ముగ్గురు దొంగతనాలలో పాలుపంచుకున్నట్లు పోలీసులకు తెలియజేశాడు. ఈ విషయంలో కోపం పెంచుకున్న ముగ్గురూ భీమేష్‌ను 2015 ఫిబ్రవరిలో కళ్యాణదుర్గం పట్టణ శివార్లలోని ధర్మవరం రోడ్డు సమీపంలో ఉన్న ఓ మామిడి తోటలోకి తీసికెళ్లి ముగ్గురూ కలిసి తలపై రాయితో మోది శవం గుర్తు పట్టని విధంగా చంపేశారు. అప్పటి ఎస్సై జయనాయక్ హత్య కేసు నమోదు చేశారు. అప్పటి సి.ఐ మన్సురుద్దీన్ దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం మహిళా కోర్టు జడ్జి గారు ముగ్గురికి జీవితఖైదు విధించారు. చెరో రూ. 5 వేలు జరిమానా విధించారు. ఈ కేసులో అడిషనల్ పి.పి సృజన గారు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. డీసీఆర్బీ సీఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఏఎస్సై శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సౌరెడ్డి, కానిస్టేబుల్ కృష్ణ మోహన్ లు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, నిందితులకు శిక్ష పడేందుకు తమ వంతు కృషి చేశారు. వీరందర్నీ జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అభినందించారు.

పేకాట స్థావరంపై దాడులు

గుత్తి : మండలంలోని కె.ఉబిచెర్ల గ్రామ శివారులో ఉన్న వంక వద్ద కంపచెట్లలోని పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడుల నిర్వహించారు. సీఐ ఎం. వెంకటరామిరెడ్డి, ఎస్సై బి.నబి రసూల్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు జూదరులు పరారయ్యారు. నిందితుల నుంచి రూ.22,860 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక టిప్పర్లు సీజ్

శింగనమల : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి మండలంలోని జూలాకాలువ గ్రామం వద్ద రెండు టిప్పర్లు పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.